# లేఖాస్త్రం

**ఏడవ తరగతి పరీక్షలు బాగా దగ్గరయ్యాయి. విద్యార్థుల్లో భయాందోళనలు ఎక్కువయ్యాయి. కామన్ ఎగ్జామ్స్ కావడంతో ఏదో చెప్పలేని భీతి విద్యార్థుల మనసుల్లో చోటుచేసుకుంది. హాల్ టికెట్స్ కూడా వచ్చేశాయి. నెంబర్లు మరచిపోకుండా ఉండేందుకు విద్యార్థులంతా వాళ్లవాళ్ల అట్టల మీద నెంబర్లు రాసుకున్నారు. స్కూల్ టీచర్స్‌కి పార్టీ చేశారు.**

పరీక్ష రోజు రానే వచ్చింది. మొదటి రోజే తెలుగు పరీక్ష కావడంతో అందరూ హుషారుగా ఉన్నారు. ఎంతైనా మాతృభాష కదా! అన్ని సబ్జెక్టుల్లోకెల్లా ఈజీ అయింది తెలుగే అని వాళ్ల ఉద్దేశం. పరీక్షరోజు ఏడవ తరగతి విద్యార్థులందరూ కొత్తబట్టలేసుకొని ఉత్సాహంగా అట్టలు చేత్తో పట్టుకొని ప్రతి టీచర్ దగ్గరకి వెళ్లి 'వెళ్లొస్తాం' సార్! అని చెప్తూ, అందరి ఆశీస్సులు తీసుకున్నారు.

విద్యార్థులు పరీక్ష హాల్లో ఎవరి సీట్లల్లో వాళ్లు కూర్చున్నారు. ఇన్విజిలేటర్ వచ్చి నవ్వుతూ అందరినీ పలుకరించాడు. విద్యార్థులు లేచి "నమస్తే" చెప్పి కూర్చున్నారు. మూడవ గంట కొట్టగానే ఇన్విజిలేటర్ అందరికీ ప్రశ్నాపత్రాలు పంచాడు. విద్యార్థులు ప్రశ్నాపత్రాలను ఒకటికి రెండుసార్లు బాగా చదువుకున్నారు. తరువాత సమాధానాలు రాయడానికి ఉపక్రమించారు.

లేఖ దగ్గరికి వచ్చారు. అందులో "ఏడవ తరగతి పరీక్షలు జరుగుతున్న విధానాన్ని గూర్చి మీ డీ.ఈ.ఓ.కి లేఖ రాయండి" అని ఒక ప్రశ్న ఉంది.

ఆ విద్యార్థుల్లో 'చైతన్య' ఒక తెలివైన విద్యార్థి. అప్పటిదాకా పరీక్ష జరుగుతూన్న విధానాన్ని చూసి వళ్లు మండిందో ఏమో ఇలా మొదలుపెట్టాడు లేఖ.

గౌరవనీయులైన జిల్లా విద్యాశాఖాధికారి గారికి,

ఆర్యా!

ఏడవ తరగతి జిల్లా కామన్ ఎగ్జామ్స్ మా ఊళ్లోని



ఫలానా సెంటర్‌లో ఈ రోజు నుంచే ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్ష మొదలైంది. ఒక్కో రూములో నలభై మంది నేలమీదే కూర్చొని పరీక్షలు రాయాల్సి వస్తున్నది. క్వశ్చన్ పేపర్ వెంటనే బైటికి పోతున్నది. బైట ఉన్న పిల్లల పేరెంట్స్, టీచర్స్ సమాధానాలు రాసి లోపలికి పంపిస్తున్నారు. అంతేకాదు పరీక్ష హాల్లోని పిల్లలు గుంపులుగా ఒక చోట చేరి తెలియనివి చెప్పుకుంటూ, చూసుకుంటూ పరీక్షలు రాస్తున్నారు. ఇన్విజిలేటర్ కాఫీలు, కూల్‌డ్రింక్స్ సేవిస్తూ తోటి టీచర్స్‌తో ముచ్చట్లు చేస్తూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాడు. పిల్లల కాపీయింగ్‌కు సహకరిస్తున్నాడు. పిల్లలకు దొరకని జవాబులను తానే వెతికి మరీ తీసుకొచ్చి పిల్లలకిచ్చి ఏదో ఘనకార్యం చేసినవాడి మాదిరి ఫీలవుతున్నాడు. ఈ విధంగా పిల్లల చేత కాపీయింగ్ చేయిస్తే ఆయనకు వచ్చే లాభం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. అది ఆయనకే తెలియాలి. ఆ దేవుడికే తెలియాలి. బిట్స్ పూర్తిగా డిక్టేట్ చేస్తున్నాడు. అప్పటికీ రాసుకోలేని వాళ్లకు బోర్డ్ మీద రాస్తున్నాడు. విద్యార్థులు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ పేజీలు నింపేస్తున్నారు. మా సెంటర్‌లో ఏడవ తరగతి పరీక్షలు జరుగుతూన్న విధానం ఇది. వచ్చే సంవత్సరమైనా పరీక్షలు స్ట్రిక్ట్‌గా జరిగేట్టు చూడండి. నమస్తే.

ఇట్లు

తమ విధేయుడు

.....

* * *

పరీక్షలైపోయి స్పాట్ వాల్యూయేషన్ మొదలైంది. డీ.ఈ.వో. పర్యవేక్షకుడిగా ఒక రోజు స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌కి వెళ్లాడు. ఒక తెలుగు సమాధాన పత్రాన్ని ఒక ఎగ్జామినర్ నుంచి తన చేతికి తీసుకున్నాడు. అది సరిగ్గా 'చైతన్య' పేపరే. వాడు రాసిన లేఖను చదివాడు. దాన్నే పిటిషన్‌గా భావించి ఆ సంవత్సరం ఆ సెంటర్‌లో పరీక్ష రాసిన విద్యార్థులందరినీ తప్పించాడు డీ.ఈ.వో. చైతన్యతో సహా. తన లేఖాస్త్రానికి తాను కూడా బలి అయ్యాడు చైతన్య.

**-దిట్టకవి శ్రీనివాసాచార్య** (ఎర్రగొండపాలెం)




